## విలేఖరులు కావలెను

తెలుగు రాష్ట్రాలలో లక్షలాది మంది పాఠకుల అభిమానాన్ని చూరగొంటున్న 'సూర్య ప్రభ' ఈ-పేపర్‌లో పని చేయుటకు జిల్లా, నియోజకవర్గాలు, మండలాల వారీగా విలేఖరులు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించగలరు.

ఫోన్ - 8985829417



# సూర్య ప్రభ

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 2 సంచిక: 10 | ఎడిటర్ : ఇ.సంజీవరెడ్డి | శనివారం, జూలై 5 2025 | పేజీలు : 4


# హైదరాబాద్‌కు మోదీ చేసింది శూన్యం

## రేవంత్ - భట్టి ద్వయం తెలంగాణ అభివృద్ధిని.... ముందుకు తీసుకుపోతోంది - ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కారణం కార్యకర్తలేనని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. ఇలా అందరూ కలిసికట్టుగా భారత రాష్ట్ర సమితిని ఓడించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని చెప్పారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన 'కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి' సభలో ఖర్గే మాట్లాడారు.

**ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం...**"గతంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులను కేసీఆర్ మోసం చేశారు. ప్రధాని మోదీ, అమిత్‌షా అబద్ధాలు చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. హైదరాబాద్‌కు మోదీ చేసింది శూన్యం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం అందిస్తోంది. రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో రూ.8,200 కోట్లు జమ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తోంది.

గిగ్ వర్కర్ల హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొస్తోంది. దేశంలో తొలిసారి కులగణన చేపట్టింది తెలంగాణ ప్రభుత్వమే. బీసీల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోంది.

**ఆ విషయంపై మోదీ ఎందుకు నోరు విప్పరు?..**దేశ ఆర్థిక పరిస్థితిని ప్రధాని మోదీ చిన్నాభిన్నం చేశారు. పాకిస్థాన్‌తో యుద్ధం చేయాలని 'ఆపరేషన్ సిందూర్'కు రాహుల్‌గాంధీతో పాటు కాంగ్రెస్ కూడా సంపూర్ణ మద్దతు ఇచ్చింది. మరి మోదీ ఎందుకు యుద్ధాన్ని మధ్యలోనే ఆపేశారు? అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేయగానే యుద్ధం ఆపేశారు.. కానీ ఆ విషయంపై ప్రధాని నోరు విప్పరు.

గతంలో అమెరికా బెదిరించినా ఇందిరాగాంధీ భయపడలేదు. దేశం కోసం ఇందిర, రాజీవ్‌గాంధీ ప్రాణాలు అర్పించారు. భాజపా, ఆర్ఎస్ఎస్ నుంచి ఒక్కరైనా ప్రాణాలు అర్పించారా?

**మణిపుర్ ఈ దేశంలో భాగం కాదా?...** ఇప్పటి వరకు ప్రధాని 42 దేశాలు తిరిగారు.. కానీ మణిపుర్ వెళ్లడానికి మాత్రం మనసు రాలేదు. ఆ రాష్ట్ర అంశంపై ఒక్కసారి కూడా ఆయన పెదవి విప్పలేదు. రాహుల్‌గాంధీ, నేను మణిపుర్ వెళ్లాం.. మోదీ మాత్రం వెళ్లలేదు. మణిపుర్ ఈ దేశంలో భాగం కాదా? మణిపుర్ వాసులు భారతీయులు కాదా? సెక్యులర్, సోషలిస్టు పదాలను ఆర్ఎస్ఎస్, భాజపా, మోదీ, అమిత్‌షా సహా ఎవరూ రాజ్యాంగం నుంచి తొలగించలేరు. మోదీజీ.. ముందు దేశ ప్రజల బాధలు వినండి.. ఆ తర్వాత విదేశాల సంగతి చూడొచ్చు. అఖిలపక్ష సమావేశానికి ప్రధాని రాలేదు.. బిహార్ ఎన్నికల ప్రచారంలో ఆయన బిజీగా ఉన్నారు" అని ఖర్గే విమర్శించారు.




హైదరాబాద్: రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల సంఘం నుంచి రాజకీయ పార్టీగా గుర్తింపు పొంది గత ఆరు సంవత్సరాలుగా ఏ ఎన్నికల్లో పోటీ చేయని పార్టీలను రాజకీయ పార్టీల జాబితాల నుంచి తొలగించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు మీ పార్టీల పేరును రిజిస్టర్ పార్టీల జాబితా నుంచి ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలంటూతెలంగాణలోని 13 పొలిటికల్ పార్టీలకు శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘం షో కాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ విషయంలో చర్యలు తీసుకునేందుకు ఈ 13 పార్టీలకు నోటీసులు ఇవ్వాలని ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది. పార్టీల పేరుతో దినపత్రికల్లో ప్రకటనలు, సోషల్ మీడియాలో ప్రచారం చేయడంతో పాటు సంబంధింత పార్టీని జాబితా నుంచి తొలగించాలా వద్దా అనే దానిపై స్పష్టమైన సిఫార్సులతో కూడిన ప్రతిపాదనలను ఈ నెల 10వ తేదీ లోపు సమర్పించాలని ఆదేశించింది. జిల్లా అధికారుల నుంచి వచ్చే నివేదికను కేంద్ర ఎన్నికల కమిషన్ కు పంపనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

# ఓ షర్మిల...ఓ కవిత...ఆ రెండు పార్టీలకూ గండమే !



బీఆర్ఎస్ లో మరో చెల్లెమ్మ కవిత వెళ్తున్నారా అన్నది చర్చగా ఉంది. ఎందుకు అంటే బీఆర్ఎస్ మీద విమర్శలు చేస్తూ టీడీపీకి బలమైన మద్దతుగా ఉన్న ఒక ప్రముఖ చానల్ కి వెళ్ళి మరీ కవిత తన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆమె కూడా బీఆర్ఎస్ మీద పరోక్ష విమర్శలు చేశారు. కేసీఆర్ కేటీఆర్ ల గురించి ఆమె తన మనసులోని మాటను చెప్పకనే చెప్పారు. బీఆర్ఎస్ లో తన పాత్ర గురించి చెప్పారు. ఇక తన రాజకీయ ఆకాంక్షల గురించి కూడా ఆమె ఎక్కడా దచుకోవడంలేదు. ఇవన్నీ కూడా సహజంగానే బీఆర్ఎస్ కి పెద్దగా గిట్టని చానల్ లో ఆమె ఇంటర్వ్యూ రూపంలో ఇవ్వడం అంటే కచ్చితంగా గులాబీ పార్టీకి గుచ్చుకున్నట్లే అని అంటున్నారు. ఇలా ఇద్దరు చెల్లెమ్మలు ఒకే బాటన పయనిస్తున్నారా అన్నదే ఇపుడు అంతా చర్చించుకుంటున్నారు. ఇక కవిత తనకు ఉన్న తెలంగాణా జాగృతి వేదిక నుంచి కార్యక్రమాలు నిర్వహిస్తూ కేసీఆర్ సహనాన్ని పరీక్షిస్తున్నారు అని అంటున్నారు. ఆమె ఇస్తున్న ప్రకటనలు ఆమె వైఖరి కేసీఆర్ కి ఇబ్బందిగానే మారుతున్నాయని కూడా అంటున్నారు. ఇది చాలదు అన్నట్లుగా బీఆర్ఎస్ మీద నిత్యం ఏదో విధంగా వ్యతిరేక వార్తలు వండి వార్చే ఒక చానల్ లో కూర్చుని ఇంటర్వ్యూలు ఇవ్వడం అంటే ఆమె ఏమి చెప్పదలచుకున్నారు అన్నదే అంతా ఆలోచిస్తున్నారు. ఆ విధంగా ఆమె చేయడం ద్వారా బీఆర్ఎస్ ని ఆ పార్టీ అధినాయకత్వాన్ని ఇరకాటంలో పెట్టేశారు అని అంటున్నారు. నాడు ఒక చెల్లెమ్మ కొంగు బిగించి వైఎస్ జగన్ కి ఆగర్భ ప్రత్యర్థిగా మీడియా రంగంలో ఉన్న ఒక చానల్ ముందు చెప్పాల్సింది అంతా చెప్పరు. అలా ఆమె వేసిన తొలి అడుగు వైసీపీ రాజకీయ పతనానికి దారి తీసింది అని గుర్తు చేస్తున్నారు. పట్టుదలలో తన అన్నకు ఎక్కడా తీసిపోని షర్మిల పనిగట్టుకుని ఏపీలో కాంగ్రెస్ అధ్యక్ష పదవి స్వీకరించి తాను ఏమి లబ్ది పొందారో తెలియదు కానీ తన అన్నను మాజీ సీఎం గా చేయడానికి మాత్రం ఎంతగానో దోహద పడ్డారు అని విశ్లేషణలు ఉన్నాయి. ఇక ఇపుడు షర్మిల కూడా బీఆర్ఎస్ పెద్దలు వ్యతిరేకించే చానల్ లో ద్వారానే తొలి అడుగు వేస్తున్నారా అన్నదే చర్చగా ఉంది. అలా ఆమె వేసే అడుగులు రేపటి రోజున బీఆర్ఎస్ రాజకీయ భవిష్యత్తుకు గండంగా మారుతాయా అన్నదే చర్చగా ఉంది. ఆంధ్రాలో ఒక ఆడపడుచు పిడికిలి బిగిస్తే వైసీపీకి ఏమి జరిగిందో అంతా చూశారు. ఇక తెలంగాణాలో చూస్తే మరో ఆడపడుచు దూకుడు చేస్తున్నారు. మరి గులాబీ పార్టీకి ముళ్ళు గట్టిగానే గుచ్చుతాయని అంటున్నారు. అయితే షర్మిలను కాంగ్రెస్ అనే జాతీయ పార్టీ తన ఆయుధంగా ప్రయోగించింది అని అంటారు. కవితకు ఏ రాజకీయ పార్టీ దన్ను దొరుకుందో ఏ రకమైన అండ ఆమె అందుకోబోతున్నారో ప్రస్తుతానికి సస్పెన్స్ అని అంటున్నారు.

వైసీపీ ఎందుకు ఓడిపోయింది అంటే ఈ రోజుకీ సరైన విలువైన కారణం చెప్పలేరు. ఎందుకు అంటే అనేక కారణాలు అందులో ఇమిడి ఉన్నాయి. వాటిలో అత్యధిక శాతం అధినాయకత్వానికి నేరుగా సంబంధం ఉన్నవే. అందువల్లనే ఓటమి మీద ఆత్మ విమర్శలు సమీక్షలు పూర్తి స్థాయిలో ఉన్నాయా అన్నదే ప్రశ్న. వైసీపీ ఓటమికి అనేక కారణాలు ఉండొచ్చు కానీ అతి ప్రధాన కారణం సెంటిమెంట్ లాంటి వైఎస్ షర్మిల అంటే ఆ పార్టీ పెద్దలు ఒప్పుకోక పోవచ్చు. కానీ ఇది పచ్చి నిజం అనే కఠిన విశ్లేషణలు ఉన్నాయి. షర్మిల జగన్ మీద నేరుగా చేసిన ఆరోపణలను వైసీపీ హార్డ్ కోర్ రీజియన్ అయిన రాయలసీమ జిల్లాల వారు నమ్మారు. అందుకే మొత్తంగా 52 అసెంబ్లీ సీట్లకు గానూ ఏడంటే ఏడు సీట్లు మాత్రమే దక్కాయని చెబుతారు. ఇక షర్మిల జగన్ మీద తన రాజకీయ పోరాటానికి ముందు వైసీపీ తీవ్రంగా వ్యతిరేకించే టీడీపీకి స్ట్రాంగ్ గా సపోర్టు చేసే ఒక ప్రముఖ చానల్ ని ఎంచుకున్నారు ఆ చానల్ నుంచే ఆమె జగన్ మీద తాను చేయబోయే భవిష్యత్తు పోరాటాల గురించి చూచాయగా వివరించారు. ఆ తరువాత కూడా జరిగింది అదే. వైసీపీ ఫ్యాన్ కి ఎదురు నిలిచి సునామీ లాంటి ఎదురు గాలితో ఫట్ కొట్టించడం వెనక షర్మిల ప్రభావం గాఢంగా ఉందని అంతా నమ్ముతారు. ఇక చూస్తే అదే బాటలో



# 'ఆమె'కే అగ్రతాంబూలం

## బీజేపీ జాతీయ అధ్యక్ష పీఠంపై మహిళ..!

## ఆ ముగ్గురిలో ఎవరికి దక్కేనో?

న్యూఢిల్లీ: కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారం దక్కించుకోవడంతోపాటు దేశంలో సగానికిపైగా రాష్ట్రాల్లో అధికారం చేలాయిస్తున్న బీజేపీ.. పార్టీని మరింతగా విస్తరించేందుకు సిద్ధమవుతున్నది. మరోసారి ఢిల్లీ పీఠాన్ని దక్కించుకోవడం, విపక్షాల ఏలుబడిలో ఉన్న ఆ ఐదారు రాష్ట్రాలను తన ఖాతాలో వేసుకోవడానికి కాషాయ దళం ప్రణాళికలు రచిస్తున్నది. గత ఎన్నికల్లో పార్టీ విజయాల్లో కీలకపాత్ర పోషించిన మహిళలను చేజార్చుకోకూడదని కమలం పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తున్నది. ఇందులో భాగంగా పార్టీ జాతీయ అధ్యక్ష పీఠంపై మహిళను కూర్చోబెట్టాలని తీవ్రంగా ఆలోచిస్తున్నది.

దీనికి ఆర్ఎస్ఎస్ కూడా పచ్చజెండా ఊపినట్లు సమాచారం. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, తమిళనాడు ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్, ఏపీ బీజేపీ మాజీ అధ్యక్షురాలు పురందేశ్వరి పేర్లను పార్టీ అగ్రనాయకత్వం పరిశీలి స్తున్నది. ఈ ముగ్గురిలో ఎవరినో ఒకరిని అధ్యక్ష పదవి వరించనుంది. ఒకవేళ అదే జరిగితే కషాయ దళానికి తొలిసారిగా ఓ మహిళ సారథి కానున్నది. అయితే ఈ రేసులో ప్రధాని మోదీ కేబినెట్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ముందంజలో ఉన్నట్లు తెలుస్తున్నది.

**నిర్మలా సీతారామన్..** పార్టీ అధ్యక్ష రేసులో నిర్మలా సీతారామన్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. ఇటీవలే జేపీ నడ్డా, పార్టీ ప్రధాన కార్యదర్శి బీఎస్ సంతోశ్‌లు నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో సీతారామన్ పేరునే చర్చించినట్లు తెలుస్తున్నది. కేంద్ర ఆర్థిక మంత్రిగా, రక్షణమంత్రిగా తానేంటో నిరూపించుకున్న ఆమెకు పార్టీలో సుదీర్ఘమైన అనుభవం ఉంది. అలాగే నాయకత్వ సామర్థ్యం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఆమె నియామకంతో దక్షిణాదిలో పాగా వేయాలన్న లక్ష్యం కూడా నెరవేరే అవకాశం ఉందని భావిస్తున్నారు.

త్వరలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కలిసొచ్చే అవకాశం ఉంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని భావిస్తున్న మోదీ సర్కార్.. త్వరలోనే ఈ బిల్లును కూడా ఆమోదించాలని ఆలోచిస్తున్నది. ఈ నేపథ్యంలో నిర్మలమ్మ అయితేనే సరైనవారని పార్టీ అగ్రనాయకత్వం ఆలోచనగా ఉన్నది. ఆమెకు ఆర్ఎస్ఎస్ కూడా సంపూర్ణంగా మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తున్నది.

**వనతి శ్రీనివాసన్...** తమిళనాడుకు చెందిన వానతి శ్రీనివాసన్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నది. న్యాయవాది వృత్తి నుంచి రాజకీయ నాయకురాలిగా ఎదిగిన ఆమె ప్రస్తుతం కోయంబత్తూర్ సౌత్ ఎమ్మెల్యేగా ఉన్నారు. 1993లో బీజేపీలో చేరిన ఆమె అంచలంచలుగా ఎదుగుతూ.. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. 2020లో ప్రమోషన్ పొందిన ఆమె.. బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. అనంతరం 2022లో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యురాలిగా నియమితురాలై.. తమిళనాడు నుంచి ఈ పదవి పొందిన మొదటి మహిళగా నిలిచారు.

**పురందేశ్వరి...** బహుభాషా కోవిధురాలైన రాజమండ్రి ఎంపీ, ఏపీ బీజేపీ మాజీ ప్రెసిడెంట్ పురందేశ్వరి కూడా పార్టీ జాతీయ అధ్యక్ష రేసులో నిలిచారు. కేంద్రమంత్రిగా పని చేసిన అనుభవం ఉన్న ఆమె నాయకత్వంలోనే ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ పుంజుకున్నది. ఆపరేషన్ సిందూర్‌పై వివిధ దేశాల్లో పర్యటించిన ప్రజాప్రతినిధుల బృందంలో పురందేశ్వరి కూడా ఉన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి చేపట్టాలంటే ఆర్ఎస్ఎస్ మద్దతు కూడా ఉండాల్సిందే. అధ్యక్ష ఎంపికలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పాత్ర ప్రధానమైనది. ఇటీవల పలు రాష్ట్రాల్లో నియమితులైన పార్టీ అధ్యక్షుల్లో ఆర్ఎస్ఎస్ ముద్ర స్పష్టంగా కనిపిస్తున్న విషయం తెలిసిందే. పార్టీలో మొదటి నుంచి కొనసాగుతున్న వారికే పదవుల్లో ప్రియార్టీ ఇస్తున్నది. ఈ నేపథ్యంలో పురందేశ్వరికి ఈ విషయం ప్రతిబంధకంగా మారే అవకాశం ఉన్నది.

కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన ఆమె.. కొన్నేండ్ల క్రితమే బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. కాగా, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా పదవీకాలం రెండేండ్ల క్రితమే (2023, జనవరి) ముగిసింది. అయితే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పదవీకాలాన్ని 2024 జూన్ వరకు పొడిగించారు.

నూతన అధ్యక్షుడిని ఎంపికచేయకపోవడంతో ఆయన ఇంకా ఆ పదవిలోనే కొనసాగుతున్నారు. ఆయనను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకోవడంతో అధ్యక్షుడి మార్పు తప్పనిసరి అయింది. దీంతో పార్టీ అగ్రనాయకత్వం అధ్యక్ష మార్పుపై తీవ్ర కసరత్తు చేస్తున్నది.

# గాజులరామారంలో ఘనంగా వంగవీటి మోహనరంగా 78వ జయంతి ...

వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మోహనరంగా గొప్ప వ్యక్తి. అన్నారు కార్పొరేటర్ రావుల శేషగిరి శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం...





కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 డివిజన్ పరిధిలోని గాజులరామారం రంగా సెంటర్‌లో శుక్రవారం శ్రీ వంగవీటి మోహనరంగా 78వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక జీహెచ్ఎంసీ కార్పొరేటర్ రావుల శేషగిరి అధ్యక్షత వహించారు. రంగా విగ్రహానికి పూలమాలలువేసి కార్యక్రమాన్ని ప్రారంభించి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంజనేయులు పర్యవేక్షణలో నిర్వహించగా, జనరల్ సెక్రటరీ రవికాంత్ పూర్తి స్థాయిలో మద్దతు అందించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ కూకట్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ పాల్గొని రంగా గొప్పతనాన్ని గురించి ప్రసంగించారు. అలాగే కాపు నాయకులు చక్క సురేష్, సత్యనారాయణ, శివ, భగవాన్ తదితరులు హాజరై రంగా సేవలను కొనియాడారు. మహిళలు, వెనుకబడిన వర్గాల సాధికారతకు రంగా వేసిన బాటను గుర్తు చేశారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి ఉపాధ్యక్షులు రామకృష్ణ, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు ఆనంద్ సాయి, పులి కుమార్ అహర్నిశలు శ్రమించారు. అలాగే శ్రీకృష్ణదేవరాయ సంఘం ఖజానాదారులు సోమరాజు, రంగారావు మరియు సభ్యులు నాగబాబు, వీరబాబు, రాంబాబు, సత్య, బాలభాస్కర్, వేను, దుర్గ, అచ్యుత్, సురేష్, సత్యరావు, ప్రసాద్, బాలాజీలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వంగవీటి మోహన రంగా జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ...

కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతి నగర్ లో శుక్రవారం వంగవీటి మోహన రంగా జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్సవాలల్లో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ఈ సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు





లు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ వంగవీటి మోహన రంగ ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గాజుల సుజాత, మాజీ కోఆప్షన్ సభ్యులు చంద్రగిరి సతీష్, కమిటీ సభ్యులు పృథ్వీ, బోనం నాయుడు, మల్లేశ్వర్ రావు, సుధాకర్, లచ్చిబాబు, జైరాం, రంజిత్, శివ, నాగరాజు, మరియు కమిటీ సభ్యులు స్థానికులు, తదితరులు పాల్గొన్నారు..

## కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుల సమ్మేళన సభకు భారీ వాహనాలతో బయలుదేరిన నియోజకవర్గ ఇంచార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి





కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే మరియు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇంచార్జ్ కోలార్ హనుమంత్ రెడ్డి కాంగ్రెస్ శాఖ గ్రామీణ అధ్యక్షులు సమ్మేళనకు ముఖ్యఅతిథిగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియం లో నిర్వహిస్తున్న గ్రామీణ ఉపాధ్యక్షులు సమ్మేళన సభ కు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి మరియు టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున తరలి వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు, సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు

## అనుసంధాన అవస్థలు

మిర్యాలగూడ : నిరుపేద కుటుంబాల వారికి తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వారికి రక్షణ కల్పించే ఆరోగ్యశ్రీ పథకం నూతనంగా ఇచ్చిన రేషన్‌కార్డుల వారికి అనుసంధాన ప్రక్రియ జాప్యం కావడంతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2005లో నూతనంగా అప్పటి ప్రభుత్వం రేషన్ కార్డులు అందించిన సమయంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్డులను సైతం అందజేసింది. అప్పట్లో రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు వేర్వేరుగా ఉండేవి. ఆరోగ్యశ్రీ కార్డు తీసుకొని వెళ్తే ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం అందించేవారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సుమారు పదేళ్లపాటు నూతన రేషన్ కార్డులు మంజూరు చేయకపోగా.. ఉన్న కార్డులోనే మార్పులు చేసి ఆన్‌లైన్ కార్డులు అందించారు. ఈ సమయంలో రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకొని ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేశారు. నిరుపేదలు అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లినప్పుడు రేషన్‌కార్డు తీసుకెళ్తే దీని ఆధారంగా ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తూ వచ్చారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల క్రితం కొత్తగా రేషన్ కార్డులను మంజూరు చేసింది. పాత కార్డుల్లో కుటుంబ సభ్యులను చేర్చడం, మృతుల పేర్లు తొలగింపు, కొత్తగా పెళ్లి చేసుకున్న వారికి నూతనంగా కార్డులు అందించారు. వీరికి చౌక దుకాణాల్లో రేషన్ సరకులు సైతం అందిస్తున్నారు.

నూతనంగా ఇచ్చిన రేషన్ కార్డులకు ఉన్నతాధికారులు ఆరోగ్యశ్రీ అనుసంధానం చేయకపోవడంతో సమస్య తలెత్తుతుంది. నూతనంగా మంజూరు చేసిన కార్డులను ఎప్పటికప్పుడు అనుసంధానం చేసినట్లైతే ఆరోగ్యశ్రీ సేవలు అందే అవకాశం ఉంది. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టిసారించి సమస్య పరిష్కరించాలని నూతన రేషన్ కార్డు లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ సమస్యపై తహసీల్దారు శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని వివరించారు.

# నీటిచుట్టూ పాచి.. రోగాల బూచి..!



సూర్యాపేట : వర్షాలు ప్రారంభమయ్యాయి. వ్యాధులు ముసురుకునే సమయం ఇదే. దోమలతోనే కాకుండా మంచినీరు కలుషితం కావడం వల్ల కూడా ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. అధికారులు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకునేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లుగానే ప్రత్యేకంగా వానాకాలం మంచినీటి ట్యాంకుల నిర్వహణపై ప్రత్యేక కార్యక్రమం చేపడితే తప్పా.. ఉన్న ట్యాంకులు శుభ్రమయ్యే పరిస్థితి లేదు. కొన్ని పురపాలికల్లో నెలలో రెండు సార్లు శుభ్రం చేస్తున్నట్లు చెబుతున్నా వాస్తవానికి నెలకుపైగా సమయం తీసుకుంటున్నారు. దీనికి ప్రధాన కారణం సిబ్బంది కొరత ఉండటమే కాక కొంత నిర్లక్ష్యం కూడా ఉంది. పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం మంది ప్రజలు మంచినీటిని కొనుక్కొని తాగుతుండటం వల్ల ట్యాంకుల శుభ్రతపై అధికారులు దృష్టి సారించడం లేదు. హుజూర్‌నగర్‌లో నెలకోసారి ట్యాంకులను శుభ్రం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా.. సిబ్బంది కొరత వల్ల అన్ని సార్లు సాధ్యం కావడం లేదు. పట్టణంలో మొత్తం 11 ట్యాంకులున్నాయి. అన్నీ వాడకంలోనే ఉన్నాయి. పురపాలికలో 28 వార్డులు ఉండగా.. 8,600 ఆవాసాలు ఉన్నాయి. 8,600 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. పట్టణం పెరుగుతున్నందున మరో 2 వేల వరకు నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. ట్యాంకులకు నీటిని విడుదల చేసే సమయంలో సిబ్బంది వెంటనే చూడక పోవడం వల్ల నీరు పొంగిపొర్లి చుట్టూ నాచుపట్టి అపరిశుభ్రంగా తయారవుతోంది. కొన్నిసార్లు మంచినీటి ట్యాంకుల ద్వారా నీరు విడుదల చేయలేని రోజుల్లో ఒక కలుషితమైన బావి నుంచి ఇస్తున్నారు. కమిషనర్ శ్రీనివాసరెడ్డిమాట్లాడుతూ.. నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయిస్తున్నామన్నారు. కోదాడ పట్టణంలో చాలా వరకు నీటి ట్యాంకులు పాకురు పట్టి దర్శనమిస్తున్నాయి. పట్టణ వ్యాప్తంగా సుమారు 21 ట్యాంకులు ఉన్నాయి. వీటిలో చాలా ట్యాంకులు పాకురు పట్టి, నీరు లీకేజీతో ఉన్నాయి. ఈ చిత్రంలో ట్యాంకు చుట్టూ పాకురు పట్టి కనిపిస్తున్న ప్రాంతం పట్టణంలోని మాతానగర్‌లోనిది. ట్యాంకు బయటి వైపే ఇలా ఉంటే లోపలి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పుర కమిషనర్ రమాదేవి స్పందిస్తూ పట్టణంలోని అన్ని ట్యాంకులు నిత్యం శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశిస్తున్నట్లు తెలిపారు.

**సూర్యాపేటలోని శుభ్రం చేసిన ట్యాంకు**

సూర్యాపేట పురపాలికలో ట్యాంకుల శుభ్రతనుపుర అధికారులు పాటిస్తున్నారు. పట్టణంలో మొత్తం 12 ట్యాంకులు ఉండగా, 11 ట్యాంకులు పట్టణ ప్రజలకు నీటిని అందిస్తున్నాయి. మొత్తం 48 వార్డులుండగా 39,800 నివాసాలు ఉన్నాయి. 70 శాతం నల్లానీటిపై ఆధారపడుతున్నారు. మిగతా 30 శాతం నివాసాలు బోరు నీటిని వినియోగిస్తున్నాయి. మొత్తం నల్లా కనెక్షన్లు 27,820 ఉన్నాయి. 11 ట్యాంకులను నెలకు రెండుసార్లు పుర అధికారులు శుభ్రం చేయిస్తున్నారు. నిర్మల ఆసుపత్రి రోడ్డులోని ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్యాంకు నీటిని నిలిపివేశారు. పుర కమిషనర్‌ను వివరణ కోరగా త్వరలో కొత్త ట్యాంకు నిర్మాణం చేపడతామని, దానికి అనుమతులు వస్తే వెంటనే పాత ట్యాంకును కూల్చివేస్తామని తెలిపారు.

# 'అమృత్' యోగం.. మందగమనం



తాండూరు: తాండూరు పట్టణం క్రమేపీ విస్తరిస్తోంది.. జనాభా అదే స్థాయిలో పెరుగుతోంది. తాగునీటి అవసరాలు మాత్రం తీరడం లేదు. ఏ కాలమైనా స్థానికులు ఎద్దడి ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద నిధులు మంజూరు చేసింది. గతేడాది ఆగస్టులో పనులకు శంకుస్థాపన జరిగినా, దాదాపు పది నెలలు గడుస్తున్నా వేగం పెరగలేదు. ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మించేందుకు రెండు చోట్ల గుంతలు తవ్వి వదిలేశారు. ఒక చోట మాత్రమే పనులు ప్రారంభించారు.

**పూర్తయితే 3 ఎం.ఎల్.డి. నీటి సరఫరా..**

ఈ పథకం ద్వారా తాగునీటి సరఫరా ప్రాజెక్టు పూర్తయితే పట్టణ వాసులకు నిత్యం 3 ఎం.ఎల్.డి.(మిలియన్ లీటర్ ఫర్ డే) నీరు సరఫరా జరుగుతుంది. ఎన్టీఆర్ కాలనీ, రాజీవ్‌గృహకల్ప కాలనీల్లో 500 కె.ఎల్ చొప్పున నీటి సామర్థ్యం ఉన్న ఒక్కో ట్యాంకు, పాత మున్సిపల్ కార్యాలయం వద్ద 1,000 కె.ఎల్ సామర్థ్యం ఉన్న ఒక ట్యాంకు నిర్మిస్తారు. వీటికి మిషన్ భగీరథ ద్వారా 3 ఎం.ఎల్.డి. నీరు సరఫరా చేస్తారు. మొత్తం 60 కిలోమీటర్ల పొడవునా విస్తరించే పైపులైన్‌ను పట్టణంలోని పాత పైపులైన్‌కు అనుసంధానించి నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. పనులు వేగంగా జరగక పోవడంతో స్థానికులు పెదవి విరుస్తున్నారు. అవసరాలకు నీటిని కొనుగోలు చేస్తున్నారు. చిన్న కుటుంబాలైతే ప్రతి నెలా రూ.300, పెద్ద కుటుంబాలు రూ.600 చొప్పున వ్యయం చేస్తున్నాయి

**వినియోగంలోకి రాని పాత పంప్‌హౌస్..**

తాండూరు పట్టణ వాసులకు ఒకప్పుడు అవసరానికి తగ్గట్టు తాగునీటిని సరఫరా చేసిన రెండు పంప్‌హౌస్‌ల్లో ఒకటి వినియోగించడంలేదు. దీన్ని అందుబాటుల్లోకి తీసుకురావాల్సిన అధికారులు అటు వైపు దృష్టి పెట్టడం లేదు.

ఇదీ సమాచారం

మున్సిపాలిటీ: తాండూరు

వార్డులు: 36

నివాస గృహాలు: 14,000

అధికారిక జనాభా: 71,000

అనధికారిక జనాభా లెక్క: లక్షకు పైనే

కుళాయిలు: 9,000

ఓవర్‌హెడ్ ట్యాంకులు: 6

నిత్యం అవసరమయ్యే తాగునీరు: 12 ఎం.ఎల్.డి

మిషన్ భగీరథ, పాత పంప్‌హౌస్ నుంచి సరఫరా జరుగుతున్నది: 9 ఎం.ఎల్.డి.

ఆరు నెలల్లో మెరుగైన నీటి సరఫరా

తాండూరు పట్టణానికి ఆరు నెలల్లో మెరుగైన తాగునీటి సరఫరా చేస్తాం. అమృత్ 2.0 పనులు ఆలోగా పూర్తి చేస్తాం. ప్రత్యేకంగా విస్తరించే పైపులైన్‌ను పట్టణంలోని పాత పైపులైన్‌కు అనుసంధానిస్తాం. ప్రజల అవసరాలకు తగ్గట్టు 12 ఎం.ఎల్.డి. నీటిని సరఫరా చేస్తాం. నిరుపయోగంగా ఉన్న పంప్‌హౌస్ అందుబాటులోకి తీసుకువస్తాం. ఖాజాహుస్సేన్, సహాయ ఇంజినీరు.

## కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుల సమ్మేళన సభకు భారీ వాహనాలతో బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామ,పట్టణ స్థాయి కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళన భారీ బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న సందర్భంగా ఈ భారీ బహిరంగ సభను







విజయవంతం చెయ్యడానికి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్, కెకెఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి 40 బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలపై 3వేల మంది కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డివిజన్,బ్లాక్ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు,అనుబంధ సంఘాలు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో బయలుదేరారు...

# దర్జాగా కబ్జా

బీబీనగర్ : రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. రాత్రికిరాత్రే నిర్మాణాలు సాగుతున్నా అటువైపు చూసే అధికారే కరవయ్యారు. రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలోని యాదాద్రి భువనగిరి బీబీనగర్ మండలంలో సుమారు తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూమి (బిలా నెంబర్)లో ఆరు ఎకరాల వరకు కబ్జాకు గురైంది.

**మూడు గ్రామాల మధ్యన మిగులు భూమి**

బీబీనగర్ మండలం రహీంఖాన్‌గూడ శివారులోని రెవెన్యూ సర్వే నెంబర్లు 86, 87, 88, 89, రాఘవాపురం రెవెన్యూ సర్వే నెంబర్లు 572, 573, 574, 575, బీబీనగర్ రెవెన్యూ సర్వే నెంబర్ 522లకు మధ్యన, మూడు రెవెన్యూ గ్రామాల నడుమ సుమారు తొమ్మిది ఎకరాల మిగులు భూమిని గతంలో రహీంఖాన్‌గూడ గ్రామానికి చెందిన కొందరు రైతులు (పక్క సర్వే నెంబర్ల పట్టాదారులు) సాగు చేసే వారు. ఆ తర్వాత ఇరవై ఏళ్ల కిందట సదరు పట్టాదారులు వారిపై పట్టా ఉన్న మొత్తం భూమిని వేరొకరికి విక్రయించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. మూడేళ్ల కిందట తమ కుటుంబానికి చెందిన భూమిని మేం సాగుచేసుకుంటామని కొందరు వచ్చి అక్కడ పాక వేసేందుకు ప్రయత్నించగా అది ప్రభుత్వ భూమి అని నాటి సర్పంచి మంచాల రవికుమార్ వారించారు. అయినా వారు వినకుండా అక్కడ సాగుచేసేందుకు ప్రయత్నించడంతో సర్పంచి రవికుమార్ 2022లో బీబీనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదుచేశారు. రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయి పరిశీలన చేసి, ప్రభుత్వ మండల సర్వేయర్‌తో సర్వేచేసిన తర్వాత నాటి తహసీల్దార్ అశోక్‌రెడ్డి సదరు స్థలం మూడు గ్రామాల శివారుల మధ్య ఉన్న ఖాళీ భూమి (బిలా నెంబర్) అని, అది ప్రభుత్వానికి చెందుతుందని అధికారికరంగా ధ్రువీకరించారు.

**విద్యుత్తు అనుమతులు ఇవ్వకున్నా..**

రహీంఖాన్‌గూడ శివారులోని భూమిలో బోరు వేసి సౌర విద్యుత్తు సాయంతో అక్కడ సాగుచేయడం మొదలుపెట్టారు. అప్రమత్తమైన గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రభుత్వ భూమిలో అక్రమంగా చొరబడ్డ వారికి ఇంటి, విద్యుత్తు అనుమతులు ఇవ్వొద్దని నాటి సర్పంచి అధికారిక లెటర్ హెడ్‌పై 2024 జనవరి 22న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు మారడం, సర్పంచి పదవీకాలం ముగియడంతో వారిని పట్టించుకునే వారు లేకపోవడంతో ఆక్రమణదారులు సాగుతో ఆగకుండా కట్టడాలకు తెరలేపారు. రహీంఖాన్‌గూడ గ్రామపంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి రామకృష్ణను వివరణ కోరగా ఆ విషయం తమకు తెలియదనడం కొసమెరుపు.

ప్రభుత్వ భూమిగా గుర్తించిన ఖాళీ స్థలం నుంచి ఆక్రమణదారులను పంపించాలని 2023 ఫిబ్రవరి 14న (ఫైల్ నెంబర్- బి/161/2023) ద్వారా బీబీనగర్ పోలీసులకు లేఖ కూడా రాశారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇన్నాళ్లు ఖాళీగా ఉన్న భూమిలో ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు.

**కఠిన చర్యలు తీసుకుంటాం**

బీబీనగర్, రహీంఖాన్‌గూడ, రాఘవాపురం గ్రామాల మధ్యన ఉన్న మిగులు భూమిని గత రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన, సర్వేచేసి బిలా నంబర్‌గా గుర్తించారు. సదరు భూమిపై పూర్తిహక్కులు ప్రభుత్వానికే ఉంటాయి. ఆక్రమణదారులు కాదని కబ్జాచేసేందుకు యత్నిస్తే చర్యలు తప్పవు. శ్యాంసుందర్‌రెడ్డి, తహసీల్దార్, బీబీనగర్




## కొత్త, పాత తేడాలొద్దు.. అందరూ ఐక్యంగా ముందుకెళ్లాలి: మల్లికార్జున ఖర్గే

హైదరాబాద్: పార్టీలో అందరూ ఐక్యంగా ముందుకెళ్లాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. కొత్తపాత తేడా వద్దని.. త్వరలో అన్ని కమిటీల నియామకం పూర్తిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక ఎన్నికలపై గాంధీభవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశమైంది. తొలుత పాశమైలారం ఘటనపై నేతలు సంతాపం తెలిపారు. అనంతరం బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలపై చర్చించారు. జై బాపు–జై భీమ్–జై సంవిధాన్ కార్యక్రమాలపై సమాలోచనలు చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ పార్టీకి సంబంధించిన అంశాలపై బయట ఎలాంటి విమర్శలు చేయొద్దని.. ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సమన్వయం చేయాలని దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులపై మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా మంత్రులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని సీఎం వ్యాఖ్యానించారు. సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ కొత్త, పాత నేతల మధ్య సమన్వయం లేదన్నారు. కొత్తగా వచ్చినవారు పాతవారితో కలిసి వెళ్తే పార్టీ బలం పెరుగుతుందని చెప్పారు.




హైదరాబాద్: నగరంలోని లక్డీకాపూల్‌లో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి , ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. రోశయ్య జయంతి సందర్భంగా నేతలు నివాళి అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ పదవులను నేతలు సాధారణంగా తీసుకోవద్దని.. వాటితోనే గుర్తింపు, గౌరవం వస్తుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

రాజకీయాల్లో ఎదిగేందుకు అవి ఉపయోగపడతాయని చెప్పారు. గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో వచ్చే పదేళ్లు మన పార్టీయే అధికారంలో ఉంటుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. "నేను పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు 45 లక్షల సభ్యత్వాలు చేశాం. యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ విభాగాల వారితో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుల్లో చాలా మందికి ప్రభుత్వంలో పదవులు వచ్చాయి. రానున్న రోజుల్లో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరగబోతున్నాయి. మహిళా రిజర్వేషన్, జమిలి ఎన్నికలు ప్రభావితం చేయబోతున్నాయి. నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలి. నాయకులుగా ఎదగాలంటే ఇప్పటి నుంచే కష్టపడాలి. క్షేత్రస్థాయిలో పర్యటించి సమన్వయంతో పనిచేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనలో చాలా విజయాలు సాధించాం. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలి. కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తేవాలి" అని రేవంత్‌రెడ్డి అన్నారు.




శేరిలింగంపల్లి: హైదరాబాద్‌లోని లింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ ప్రాంతంలో హైడ్రా ఆధ్వర్యంలో నాలా ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఈక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ పనులను అడ్డుకున్నారు.

హైడ్రా అధికారులతో వాగ్వాదానికి దిగారు. నాలాలోకి వచ్చిన భవనాలు కూల్చకుండా సోమేశ్వరాలయానికి సంబంధించిన భూమి స్వాధీనం చేసుకొని నాలా నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. అందుకు దేవాదాయ శాఖ అధికారిణి భారతి ఆక్షేపించారు. నాలా ఆక్రమించిన వారిని వదిలేసి దేవాలయ భూమిని ఎలా స్వాధీనం చేసుకుంటారని ప్రశ్నించారు. ఈ విషయంలో కార్పొరేటర్‌ను కలగజేసుకోవద్దని కోరారు. చర్చలు సాగుతున్న క్రమంలో కూల్చివేతలు తాత్కాలికంగా ఆగిపోయాయి.

## సామాజిక న్యాయానికి తూట్లు పొడిచేందుకే కాంగ్రెస్ సభ: రామచందర్‌రావు



హైదరాబాద్: సామాజిక న్యాయానికి తూట్లు పొడిచేందుకే కాంగ్రెస్ సభ నిర్వహిస్తోందని తెలంగాణ భాజపా అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు 'ఎక్స్' వేదికగా విమర్శించారు. కాంగ్రెస్ దోపిడీకి తెలంగాణ అక్షయ పాత్రగా మారిందని వ్యాఖ్యానించారు. గ్యారెంటీలు, హామీల పేరుతో హడావుడి తప్ప అమలులో మాత్రం శూన్యమని విమర్శించారు. బీసీలకు తీవ్ర అన్యాయం చేసి.. ఎస్సీ, ఎస్టీలకు సంకెళు వేసి భీమ్ పేరుతో నాటకమాడుతోందన్నారు. ఎమర్జెన్సీతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాలకు తూట్లు పొడిచి.. న్యాయాన్ని, రాజ్యాంగ విలువలను కాంగ్రెస్ ఖూనీ చేసిందని ధ్వజమెత్తారు.





మరిపెడ: ఖమ్మం – వరంగల్ హైవేపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరిపెడ శివారు కుడియాతండా వద్ద రెండు లారీలు ఢీకొన్నాయి. దీంతో లారీ క్యాబిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. రెండు లారీల డ్రైవర్లు, క్లీనర్ మృతి చెందాడు. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో మంటలు ఆర్పివేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

## మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై స్పందించిన కేటీఆర్



హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి, భారాస అధినేత కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. సాధారణ వైద్య పరీక్షల కోసం నిన్న సాయంత్రం ఆయన సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చేరారని తెలిపారు. బ్లడ్ షుగర్, సోడియం స్థాయులు పర్యవేక్షించేందుకు కొన్ని రోజులు ఆసుపత్రిలో ఉండాలని వైద్యులు సూచించినట్టు చెప్పారు. ఎలాంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు లేవని, వైటల్స్ అన్నీ సాధారణంగానే ఉన్నాయన్నారు. కేసీఆర్ క్షేమం గురించి ఆరాతీస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గత రెండు రోజులుగా నీరసంగా ఉండడంతో కేసీఆర్ గురువారం సాయంత్రం ఆసుపత్రికి వచ్చారు. ఆయనను పరీక్షించిన వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ ఎంవీ రావు సూచనతో ఆసుపత్రిలో చేరారు. వైద్యుల బృందం ఆయనకు చికిత్స అందిస్తోంది. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వర్గాలు గురువారం రాత్రి 9.30 సమయంలో బులెటిన్ విడుదల చేశాయి. "నీరసంతో బాధపడుతూ కేసీఆర్ ఆసుపత్రిలో చేరారు. ప్రాథమిక పరీక్షల్లో రక్తంలో షుగర్ స్థాయులు అధికంగా, సోడియం స్థాయులు తక్కువగా ఉన్నట్లు తేలింది. కేసీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉంది. షుగర్, సోడియం సాధారణ స్థాయికి వచ్చే వరకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతారు' అని హెల్త్ బులెటిన్‌లో డాక్టర్ ఎంవీ రావు పేర్కొన్నారు.

## హనుమాన్ స్ఫూర్తిగా 'ఆపరేషన్ సిందూర్': రాజ్‌నాథ్‌సింగ్



హైదరాబాద్: హనుమాన్ స్ఫూర్తిగా 'ఆపరేషన్ సిందూర్' కొనసాగిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పాకిస్థాన్‌తో పాటు ప్రపంచానికి మనం బలమేంటో చూపించామన్నారు. పాక్ ఉగ్ర స్థావరాలను టార్గెట్ చేశాం తప్ప.. పౌరులను కాదని చెప్పారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో క్షత్రియ సేవా సమితి (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్), భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో రాజ్‌నాథ్ మాట్లాడారు. గిరిజనుల కోసం అల్లూరి సీతారామరాజు అనేక పోరాటాలు చేశారని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గెరిల్లా యుద్ధ నైపుణ్యాలతో బ్రిటిష్ వారితో ఆయన పోరాడారని గుర్తుచేశారు. "భారత్ కోసం అల్లూరి సీతారామరాజు లాంటి గొప్ప వీరుడిని ఆంధ్రప్రదేశ్ ఇచ్చింది. అడవి నుంచి విప్లవం పుట్టించి బ్రిటిష్ వారిని గజగజలాడించిన వ్యక్తి అల్లూరి. గెరిల్లా యుద్ధ నైపుణ్యాలతో ఆధునిక ఆయుధాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి ఆయన. బానిసత్వంతో కాదు ఆత్మాభిమానంతో బతకాలనేది ఆయన నుంచి మనం నేర్చుకోవాలి. అడవి బిడ్డల కోసం అల్లూరి వీరోచిత పోరాటం చేశారు. ఆయన పుట్టిన గ్రామాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నాం" అని రాజ్‌నాథ్ అన్నారు

## వైద్య ఆరోగ్యశాఖలో 2,363 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ ఆమోదం

హైదరాబాద్: తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో పెద్ద సంఖ్యలో పోస్టుల భర్తీకి అనుమతి లభించింది. దాదాపు 2,363 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఒప్పంద, పొరుగుసేవల కింద ఈ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది.

## గనుల లీజ్ రెన్యువల్‌కు సింగిల్ విండో సిస్టం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్: 500 మినరల్ బ్లాక్స్‌లో లీజ్ రెన్యువల్ సులభతరం చేశామని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. గనుల లీజ్ రెన్యువల్‌కు సింగిల్ విండో సిస్టం అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. కోల్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఖనిజాల ఉత్పత్తిలో కోల్ ఇండియా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆత్మనిర్భర్ కోసం కోల్ ఇండియా అధిక ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు. స్థానికుల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటోందన్నారు. అత్యాధునిక సాంకేతికత వినియోగించి ఖనిజాలు ఉత్పత్తి చేస్తున్నట్టు చెప్పారు. అరుదైన ఖనిజాల ఉత్పత్తిలో కూడా కోల్ ఇండియా అడుగుపెట్టిందని తెలిపారు.





## ప్రయత్నాలు ఫలించకపోయినా..: 'సీఎం కుర్చీ'పై డీకే శివకుమార్ వ్యాఖ్య

కర్ణాటక రాజకీయాల్లో సీఎం మార్పుపై ఇటీవల తీవ్ర చర్చ జరిగింది. కాంగ్రెస్ అధిష్ఠానం బుజ్జగింపులతో డిప్యూటీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్‌సర్దుకుపోవడంతో.. ప్రస్తుతానికి సమస్య తీరిపోయింది. అయితే సీఎం కావాలన్న తన కోరిక అలాగే ఉందనే అర్థంలో డీకే తాజాగా వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ ఆకాంక్షలపై మీడియా అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. "ప్రయత్నాలు ఫలించకపోయినా.. నేను బలంగా కోరుకున్న దాని కోసం చేసిన ప్రార్థనలకు సమాధానం దొరక్కుండాపోదు. అయితే రాజకీయాల గురించి చర్చించే సందర్భం ఇది కాదు. రాష్ట్రానికి మంచి జరగాలి" అంటూ తన ఆకాంక్షలను నేరుగా బయటపెట్టకుండా సమాధానం చెప్పారు డీకే. మల్లికార్జున ఖర్గే తమకు జాతీయ అధ్యక్షుడని, ఆయన సూచనల ప్రకారం పార్టీ కోసం పనిచేస్తామన్నారు. ఇటీవల కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. మరో రెండు, మూడు నెలల్లో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందన్నారు. ఆ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. అయితే.. ఐదేళ్లు తానే కర్ణాటక ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టంచేయడంతో ఆ ఊహాగానాలకు చెక్ పడింది. ఆ సమయంలో డీకే ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. "ఆయన(సీఎం)కు అండగా ఉండటం తప్ప నాకు ఇంకో ఆప్షన్ లేదు. నేను ఆయనకు మద్దతు ఇవ్వాలి. అధిష్ఠానం ఏం చెబితే అది చేయాలి" అని మీడియాతో మాట్లాడిన సంగతి తెలిసిందే. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లు రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా అంగీకారానికి వచ్చారని వార్తలూ వచ్చాయి. పలు కేసుల్లో సిద్ధరామయ్య పేరు బయటకు రావడంతో సీఎంగా ఆయనను తొలగించాలన్న డిమాండ్లు తెర పైకి వస్తున్నాయి. తాను కూడా ఎప్పటికైనా ముఖ్యమంత్రి పదవిని స్వీకరిస్తానని డీకే బహిరంగంగానే చెప్పిన సంగతి తెలిసిందే.

# తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించిన తొలి దేశంగా రష్యా

అఫ్గానిస్థాన్‌లో తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించిన తొలి దేశంగా రష్యా చరిత్రలో నిలిచింది. ఈ నిర్ణయం అంతర్జాతీయంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఇప్పటివరకు ఏ దేశం కూడా తాలిబన్‌ను అధికారికంగా గుర్తించని నేపథ్యంలో రష్యా తీసుకున్న ఈ అడుగు ఇతర దేశాలను కూడా ఆ దిశగా ఆలోచించేలా చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**-రష్యా నిర్ణయం పట్ల అఫ్గాన్ స్పందన...** రష్యా తీసుకున్న ఈ ధైర్యమైన నిర్ణయాన్ని అఫ్గాన్ విదేశాంగ మంత్రి ఆమిర్ ఖాన్ ముత్తాఖీ స్వాగతించారు. "ఇది చాలా ధైర్యంగా తీసుకున్న నిర్ణయం. ఇది మిగతా దేశాలకు ఆదర్శంగా నిలుస్తుంది. రష్యా నిర్ణయాన్ని హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నాం" అని ఆయన అన్నారు. తాలిబన్ ప్రభుత్వం



తమ పరిపాలనలో సరైన పద్ధతులు తీసుకుంటూ, దేశ అభివృద్ధికి కృషి చేస్తోందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

**-తాలిబన్‌ను గుర్తించడంలో పుతిన్ వ్యూహం...** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తాలిబన్లతో సంబంధాలను మెరుగుపర్చేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నట్లు సమాచారం. అఫ్గానిస్థాన్ మీద గల భౌగోళిక, వ్యూహాత్మక ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని పుతిన్ ఈ చర్యకు పూనుకున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. రష్యా ప్రస్తుతం 'ఇస్లామిక్ ఎమిరేట్ ఆఫ్ అఫ్గానిస్థాన్' ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది.

**-అంతర్జాతీయ ప్రతిస్పందన...** రష్యా నిర్ణయంపై ఇతర దేశాలు ఇంకా అధికారికంగా స్పందించలేదు. అయితే, అమెరికా, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలు ఈ పరిణామాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నాయి. తాలిబన్ పరిపాలన పట్ల అనేక విమర్శలు ఉన్నప్పటికీ, రష్యా ఇలా ముందడుగు వేయడం అంతర్జాతీయంగా ఎలాంటి ప్రభావం చూపుతుందనే దానిపై చర్చ కొనసాగుతోంది. తాలిబన్‌ను గుర్తించిన తొలి దేశంగా రష్యా నిలవడంతో, ఇది భవిష్యత్‌లో అఫ్గాన్ రాజకీయ పరిణామాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపనుంది. ఇతర దేశాలు కూడా రష్యా దారిలో నడవాలా లేదా అనే ప్రశ్నకు సమాధానం కాలమే చెప్పాలి.

# విమాన ప్రమాదం: పరిహారంలో ట్విస్ట్.. బాధిత కుటుంబాల ఆవేదన



జూన్ 12న జరిగిన దురదృష్టకర విమాన ప్రమాదం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్‌ఇండియా విమానం టేకాఫ్ అయిన కొద్ది సమయానికే కుప్పకూలడంతో 242 మంది ప్రయాణీకుల్లో ఒక్కరు మినహా అందరూ మరణించారు. ఈ దుర్ఘటనలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్ పౌరులు, 7 మంది పోర్చుగీస్ జాతీయులు, ఒక కెనడా పౌరుడు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదంలో మునిగిపోయిన బాధిత కుటుంబాలు ప్రస్తుతం పరిహారం విషయంలో ఎదురవుతున్న కొన్ని ప్రశ్నలతో మరింత ఆవేదన చెందుతున్నారు.

**-ఎయిరిండియాకు ఆర్థిక వివరాలు ఎందుకని?...** ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ఎయిరిండియా ?25 లక్షల చొప్పున తాత్కాలిక సహాయాన్ని ప్రకటించింది. పూర్తి పరిహారం కింద ?1 కోటి చొప్పున చెల్లింపు చేస్తామని కూడా తెలిపింది. అయితే, ఈ చెల్లింపుల కోసం బాధిత కుటుంబాల నుండి ఆర్థిక వివరాలను కోరుతున్నట్లు వార్తలు వెలువడ్డాయి. బ్రిటన్‌కు చెందిన న్యాయసంస్థ స్టీవర్ట్స్ వెల్లడించిన ప్రకారం.. ఎయిరిండియా పంపిన ప్రశ్నావళిలో, దరఖాస్తుదారులు మృతిచెందిన వారిపై ఆర్థికంగా ఆధారపడి ఉన్నారా? అనే ప్రశ్న కూడా ఉందని, ఇది బాధిత కుటుంబాలను మరింత మానసిక క్షోభకు గురిచేస్తోందని ఆ సంస్థ వాపోయింది. ఈ వివరాలు అందించకపోతే పరిహారం ఇవ్వడం కష్టమని కూడా సూచించినట్లు సమాచారం.

**-బాధితుల ఆవేదన.. న్యాయబద్ధతపై ప్రశ్నలు...** ఈ పరిస్థితిపై బాధిత కుటుంబాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. "మేము మా ప్రియమైన వారిని కోల్పోయాం, తీవ్రమైన మనోవేదనలో ఉన్నాం. ఇలాంటప్పుడు మా ఆర్థిక పరిస్థితుల గురించి అడగడం ఎంతవరకు న్యాయం?" అని ప్రశ్నిస్తున్నారు. ఆర్థిక అవసరాల నిమిత్తమే చెల్లింపులు ఇస్తామంటే, అది కేవలం ఒక లావాదేవీలా మారిపోతుందని, మానవతా దృక్పథం కొరవడుతుందని వారు భావిస్తున్నారు.

**-ఎయిరిండియా స్పందన.. ఆరోపణలు నిరాధారం...** ఈ ఆరోపణలపై ఎయిరిండియా స్పందించింది. తమపై వచ్చిన ఆరోపణలు నిరాధారమని, అవాస్తవమని స్పష్టం చేసింది. "ప్రశ్నావళిలోని వివరాలు మృతులతో దరఖాస్తుదారుల బంధాన్ని తెలుసుకోవడం కోసం మాత్రమే. అది తాత్కాలిక చెల్లింపుల ప్రక్రియను సమర్థవంతంగా చేసేందుకు అవసరం. బాధిత కుటుంబాలకు మేము తగినంత సమయం ఇస్తున్నాం. వారి పక్షాన మేము అండగా ఉంటాం" అని ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే 47 కుటుంబాలకు తాత్కాలిక సహాయం అందించినట్లు సంస్థ వెల్లడించింది.

**-బాధితులకు సరైన సహాయం అవసరం...** ఇలాంటి విషాద సమయంలో బాధిత కుటుంబాలకు న్యాయమైన, మానవీయ దృష్టితో ఆదరణ కల్పించడం అత్యవసరం. వారి గోప్యతను, ఆవేదనను గౌరవించాల్సిన బాధ్యత ఎయిరిండియా వంటి సంస్థలపై ఉంటుంది. ప్రశ్నావళులు, ధ్రువీకరణలతో కాకుండా, నేరుగా మానవతా దృష్టితో ముందుకెళ్లే విధానాన్ని అవలంబించాల్సిన అవసరం ఎంతో ఉంది. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు పరిహారం ఇవ్వడమంటే కేవలం ఆర్థిక లావాదేవీ కాదు. అది బాధను పంచుకోవడం, వారి పట్ల బాధ్యతను నిరూపించుకోవడం. ఈ విషయంలో విమానయాన సంస్థలు మరింత సున్నితంగా, బాధితుల మనోభావాలను గౌరవిస్తూ ముందుకు సాగాలని నిపుణులు సూచిస్తున్నారు.

# దేశవ్యాప్తంగా 'రాయచోటి' కలకలం.. ఏం జరిగింది?

ఉమ్మడి కడప జిల్లాలోని రాయచోటి.. నియోజకవర్గం దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. ఇదేమీ రాజకీయ కలహాలతోనో.. హత్యలతోనో కాదు.. ఫ్యాక్షన్ ప్రాబల్యం ఉన్న సీమలో ప్రశాంతంగా ఉండే నియోజకవర్గాల్లో రాయచోటి ఒకటి. ఇక్కడ రాజకీయంగా కూడా పెద్దగా సమరాలు.. సాహసాలు ఉండవు. ప్రజలు కూడా ప్రశాంతంగానే ఉంటారు. అలాంటిది ఒక్కసారిగాఈ నియోజకవర్గం దేశవ్యాప్తంగాకలకలం సృష్టించడానికి కారణమేంటి? ఎందుకు? జాతీయస్థాయిలో అధికారులు ఇక్కడకు వచ్చి పరిశీలన చేయడం ఏంటి? అనేది ఆసక్తిగా మారింది. రాయచోటి నియోజకవర్గం ఇప్పుడు ఉగ్రవాదులకు స్థావరంగా మారిందన్న వార్తే.. పెను కలకలం సృష్టిస్తోంది. ఇది ఎవరో చెప్పిన మాట కాదు.. సాక్షాత్తూ.. ఉన్నతాధికారి, పోలీసు డీఐజీ ప్రవీణ్ చెప్పుకొచ్చారు. రాయచోటిలో ఉగ్రవాదులకు శిక్షణ ఇవ్వడమేకాదు.. ఇక్కడ బాంబులు కూడా తయారు చేసినట్టు పేర్కొన్నారు. అయితే.. గుట్టు చప్పుడు కాకుండా.. చేసిన ఈ వ్యవహారం రాత్రికి రాత్రి జరిగింది కాదని కూడా చెప్పారు. ఉమ్మడి రాష్ట్రం విడిపోవడానికి ముందే.. అల్ ఉమా ఉగ్రవాద ముఠా రాయచోటిలో




అడుగు పెట్టినట్టు పేర్కొన్నారు. ఈ ముఠాకు చెందిన అబూబకర్ సిద్ధిఖీ, మహ్మద్ అలీని తమిళనాడు ఐబీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఏపీ పోలీసులు కూడా అలెర్టు అయ్యారు. పాత చీరలు అమ్ముకుంటూ.. ఎవరికీ అనుమానం రాకుండా.. వీరు ఇక్కడ సంచరిస్తున్నారని గుర్తించారు. అంతేకాదు.. ఉగ్రవాదులకు శిక్షణ కూడా ఇస్తున్నారని తెలుసుకున్నారు. దాదాపు 50 ఐఈడీలు తయారు చేసే సామగ్రి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఈ వ్యవహారం ఒక్కసారిగా దేశవ్యాప్తంగా చర్చగామారింది. రాయచోటి నియోజకవర్గం జాతీయ స్థాయిలో చర్చకు వచ్చింది. 'అల్ ఉమా' పేరుతో దక్షిణాది రాష్ట్రాల్లో దాడులు చేయడమే లక్ష్యంగా ఇక్కడ ఉగ్రవాద స్థావరాలు ఏర్పాటయ్యాయి.ఓ కేసులో ఉప్పందున్న తమిళనాడు పోలీసులు.. రాయచోటిలో రహస్యంగా విచారణ చేశారు. ఈ క్రమంలోనే ఇక్కడ ఉగ్రవాద వ్యవహారం తెరమీదికి వచ్చింది. గత నెలలోనూ.. ఉత్తరాంధ్రలోని విజయనగరం జిల్లాలోనూ ఉగ్రవాది ఏజెంటును ఒకరిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

ఇతనికి హైదరాబాద్‌లో సన్నిహితుడిగా మెలిగిన వ్యక్తిని కూడా అరెస్టు చేశారు. తాజా పరిణామంతో జాతీయ దర్యాప్తు(ఎన్ఐఏ) అధికారులు కడప చేరుకున్నారు.

## సినిమా 'షో'

### 'కేజీఎఫ్ -3' లో ఛాన్స్ అడిగిన బ్యూటీ!

'కేజీఎఫ్' ప్రాంచైజీ పాన్ ఇండియాలో ఎలాంటి సంచలనాలు నమోదు చేసిందో తెలిసిందే. రెండు భాగాలు భారీ విజయం సాధించి కన్నడ ఇండస్ట్రీ పేరు పాన్ ఇండియాలో మారు మ్రోగించింది. దీంతో యశ్ పాన్ ఇండియా స్టార్ గా మారిపోయాడు. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇండియాలో బిజీ డైరెక్టర్ అయిపోయారు. కానీ ఇదే సినిమాలో హీరోయిన్ గా నటించిన కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టి మాత్రం ఆ రేంజ్ లో వెలగలేకపోయింది. 'కేజీఎఫ్' తర్వాత మరో ఛాన్స్ అందుకోవడానికి నాలుగేళ్లు పటింది. విక్రమ్ హీరోగా నటించిన 'కోబ్రా'లో నటించింది. అక్కడ నుంచి టాలీవుడ్ కి ప్రమోట్ అవ్వడానికి మరో మూడేళ్లు సమయం పట్టింది. ప్రస్తుతం నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన 'హిట్ ది థర్డ్ కేసు'లో నటిస్తోంది. 'తెలుసు కదా' అనే మరో చిత్రం లోనూ ఛాన్స్ అందుకుంది. ముందుగా 'తెలుసు కదా'లోనే ఛాన్స్ అందుకుంది. ఆ తర్వాతే 'హిట్' లో అవకాశం



వచ్చింది. ఇవన్నీ పక్కనబెడితే 'కేజీఎఫ్ 3' కూడా ప్రకటించిన సంగతి తెలిసిందే. అది ఎప్పుడు ప్రారంభమ వుతుంది? అన్నది తెలియదుకానీ అందులో హీరో యశ్ మాత్రం యధావిధిగా కొనసాగుతాడు. పాత పాత్రలతో పాటు కొన్ని కొత్త పాత్రలు యాడ్ అవుతాయి. ఈ చిత్రాన్ని ప్రశాంత్ నీల్ మరింత ప్రతిష్టా త్మకంగాను తెరకె క్కిస్తాడు. మరి హీరోయిన్ సంగతేంటి? రెండు భాగాల్లోనూ నటించిందని శ్రీనిధిని తప్పించి కొత్త భామను తీసుకుం టారా? అన్న సందేహం రావడం సహజమే. ఇదే డౌట్ శ్రీనిధికు వచ్చింది. అందుకే ప్రశాంత్ నీల్ ని కలిసిన సమయంలో ఈ విషయం గురించి అడుగుతూనే ఉందిట. ఆ మధ్య ముంబైలో ఓ సినిమా షూట్ సందర్భంగా యశ్ ని కలిసినప్పుడు కూడా ఈ విషయం గురించి సరదాగా అడిగిందిట. కేజీఎఫ్ 2లో నా పాత్రని చంపేసారు. కేజీఎఫ్ 3 ప్లాన్ ఏంటి? అని అడిగా. మరి ఉన్నానా? లేనా? అన్నది అప్పుడే క్లారిటీ రాదు. అందుకు చాలా సమయం పడుతుందని తెలిపింది.

# ట్రెండ్ పాన్ ఇండియా అయినా టాలీవుడ్ మార్క్!



టాలీవుడ్ మాస్ ని బాలీవుడ్ కి సైతం పరిచయం అవుతోంది ఇప్పుడిప్పుడే. ఇటీవలే జాట్ తో పక్కా కమర్శియల్ సినిమా చేసి తెలుగు సినిమా ఫార్ములా ఇదీ అని అక్కడ నిరూపించాడు గోపీచంద్ మలినేని. ఈ సినిమాకు ఉత్తరాది రాష్ట్రాల్లో మంచి రెస్పాన్స్ వచ్చింది. మాస్ ఆడియన్స్ ను కనెక్ట్ చేయడంలో నూరుపాళ్లు సక్సెస్ అయింది. ఇలాంటి కమర్శియాల్టీ బాలీవుడ్ లో కనిపించదు. అక్కడ మేకింగ్ స్టైల్ వేరు. టాలీవుడ్ స్టైల్ వేరని ప్రూవ్ చేసారు. టాలీవుడ్ నుంచి రిలీజ్ అవుతున్న పాన్ ఇండియా చిత్రాల్లో సైతం ఐటం పాటలతో ఉత్తరాదిని ఏ రేంజ్ లో ఊపుతున్నారో చెప్పాల్సిన పనిలేదు. పుష్ప లో ఊ అంటావా మావ పాట అక్కడ ఏ రేంజ్ ఊపు తెచ్చిందే తెలిసిందే. నార్త్ లో సైతం రీల్స్ హల్చల్ చేసాయి అటుపై పుష్ప 2 లో కిసిక్ పాటే అంతే కనెక్ట్ అయింది. అంతకు ముందు కేజీఎఫ్ లోనూ స్పెషల్ సాంగ్ తో అలరించిన సంగతి తెలిసిందే. తమన్నా స్టెప్పు లకు ఓ రేంజ్ లో రెస్పాన్స్ వచ్చింది. మల్లికా షెరావత్, మలైకా అరోరా దిగొచ్చినట్లే అనిపించింది. ప్రస్తుతం యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో చేస్తోన్న డ్రాగన్ లోనూ అలాంటి స్పెషల్ సాంగ్ ఒకటి ప్లాన్ చేస్తున్నారు. ఇది నెక్స్ట్ లెవల్లో ఉంటుందని సమాచారం. ఈ పాట కోసం శ్రుతి హాసన్ ని రంగంలోకి దించుతున్నారు. అలాగే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తోన్న పెద్ది చిత్రంలో సైతం బుచ్చిబాబు ఇలాంటి ఛాన్స్ తీసుకునే అవకాశం ఉంది. గ్లోబల్ స్టార్ తో పక్కా మాస్ సినిమా తెరకెక్కిస్తున్నాడు. అలాంటప్పుడు హీటెక్కించే ఐటం పాట లేకుండా పెద్ది ఉంటుందా? లేకపోతే అభిమానులు ఊరుకుంటారా? ఇలా పాన్ ఇండియా చిత్రాల్లో సైతం మేకర్స్ టాలీవుడ్ కి కలిసొచ్చిన ఐటం సాంగ్ ను జత చేస్తూ ఇండియాని అల్లాడిస్తున్నారు.

# కథ విన్నప్పుడే ఆ విషయం ఫిక్సయ్యా

కెజిఎఫ్ ఫ్రాంచైజ్ సినిమాలతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది హీరోయిన్ శ్రీనిధి శెట్టి. కెజిఎఫ్1, కెజిఎఫ్2 సినిమాలతో మంచి ఫాలోయింగ్ సంపాదించిన శ్రీనిధి ఇప్పుడు టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కిన హిట్: ది థర్డ్ కేస్ సినిమాలో శ్రీనిధి హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో శ్రీనిధి మీడియాతో మాట్లాడి పలు విషయాలను షేర్ చేసుకుంది. కెజిఎఫ్, కెజిఎఫ్2, ఇప్పుడు హిట్3 మూడూ సినిమాలూ హింసతో కూడుకున్నవేనని, కానీ తాను మాత్రం చాలా సాఫ్ట్ అని, వయొలెన్స్ ను తాను వద్దనుకున్నా, వయొలెన్స్ తనను వద్దనుకోవడం లేదని, అయితే హిట్3 సినిమా మొదటి సీన్ నుంచి వయొలెన్స్ గా ఉండదని, అవసరమైన చోట మాత్రమే ఇందులో యాక్షన్ ఉంటుందని, కెజిఎఫ్ సినిమాలకు హిట్3 సినిమాకు చాలా తేడా ఉందని చెప్పింది. ఈ సినిమా కథ విన్నప్పుడే యాక్షన్ సినిమా అని అర్థమైందని, అప్పుడే ఈ సినిమాకు ఏ సర్టిఫికేట్ వస్తుందని అర్థమైందని, ఈ విషయంలో నానితో ఏ సర్టిఫికేట్ మూవీ చేయడానికి నీకు 16 ఏళ్లు పట్టింది కానీ నేను నాలుగో సినిమాతోనే ఈ ఫీట్ ను సాధించానని చెప్తుంటానని శ్రీనిధి తెలిపింది. అయితే అందరూ



అనుకున్నట్టు ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాదని శ్రీనిధి ఈ సందర్భంగా క్లారిటీ ఇచ్చింది. హిట్3 లో క్రైమ్, ఇన్వెస్టిగేషన్, డ్రామా, యాక్షన్, లవ్, అన్నీ ఉంటాయని, కాకపోతే యాక్షన్ కొంచెం ఎక్కువగా ఉంటుందని, వయొలెంట్ గా ఉండే అర్జున్ సర్కార్ ను కూల్ చేసే భార్య, ప్రేయసి మృదుల క్యారెక్టర్ లో తాను కనిపిస్తానని, సినిమాలో అర్జున్, మృదుల మాట తప్పించి ఇంకెవరి మాటా వినడని, అందుకే కథలో అవసరమైన ప్రతీ చోటా తన పాత్ర కనిపిస్తుందని, దాంతో పాటూ తన క్యారెక్టర్ కు మరో ఇంట్రెస్టింగ్ యాంగిల్ కూడా ఉందని, అదేంటనేది స్క్రీన్ పైనే చూడాలని శ్రీనిధి తెలిపింది. తెలుగులో పరిచయం అవుతున్న మొదటి సినిమాకు సొంతంగా డబ్బింగ్ చెప్పుకోవాలనే ఆశతో ఈ సినిమాకు తానే డబ్బింగ్ చెప్పానని, కన్నడ అమ్మాయిలా కాకుండా తెలుగమ్మాయిలా ఈ సినిమాకు డబ్బింగ్ చెప్పానని, ఈ విషయంలో డైరెక్టర్ శైలేష్ తనకెంతో సాయం చేశాడని చెప్పింది. ఇదే ఇంటర్వ్యూలో బాలీవుడ్ లో తెరకెక్కుతున్న రామాయణం సినిమాలో సీత పాత్ర గురించి కూడా శ్రీనిధి క్లారిటీ ఇచ్చింది. రామాయణం సినిమాకు తాను కేవలం ఆడిషన్ మాత్రమే ఇచ్చానని, కానీ మళ్లీ చిత్ర యూనిట్ నుంచి తనకెలాంటి ఫోన్ రాలేదని, సీత పాత్ర తనకు వస్తే తాను వదులుకున్నానని వస్తున్న వార్తల్లో ఏ మాత్రం నిజం లేదని, అసలు అలాంటి పాత్రలు వస్తే ఎవరైనా ఎందుకు వదులుకుంటారని ప్రశ్నించింది. ప్రస్తుతం తెలుగులో సిద్దూ జొన్నలగడ్డ సరసన తెలుసు కదా సినిమా చేస్తున్న శ్రీనిధి, కెజిఎఫ్3లో తాను ఉంటుందో ఉండదోననే ప్రశ్నను డైరెక్టర్ ప్రశాంత్ నీల్ ను అడగాలని చెప్పింది.

Name of Premises : Venus Enclave, Block - 0, Quthbullapur City, Medchal Malkajgiri District - 500055, email : sanjeevreddyetlapuram@gmail.com. Cell : 8985829417